ప్రజాశక్తి

సోమవారం 16 డిసెంబర్ 2024





ఘనంగా పోలీస్ 'స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్'



ప్రజాశక్తి-నెల్లూరు :పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా వార్షిక పోలీస్ "స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024"ను ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆట్టహాసంగా ప్రారంభించారు. ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శాంతి చిహ్నం, ఖేలోత్సాహానికి సూచికగా పావురాలు త్రివర్ణ పతాకానికి గుర్తుగా బెలూన్ లను గాల్లోకి వదిలి, స్పోర్ట్స్ టార్చ్ ను వెలిగించి 2 రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తొలుత క్రీడల్లో పాల్గొనే 5 సబ్ డివిజన్లు, ఏఆర్, హెూం గార్డ్స్ ,డిపిఓ అధికారులు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రతిజ్ఞ చేసారు. ఎస్‌పి జి. కృష్ణకాంత్ మాట్లాడుతూ ముందుగా యావత్ భారత గర్వ పడేలా 18 ఏళ్లకే ప్రపంచ చెస్ ఛాంపియన్ గా అవతరించిన దొమ్మరాజు గుకేష్ కు అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్‌పి వాలీబాల్ క్రీడా పోటీలో పాల్గొని క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) సిహెచ్. సౌజన్య, అడిషనల్ యస్.పి.(ఎ.ఆర్) మునిరాజ , ఎఆ చంద్రమౌళి ఉన్నారు.

పేదల భూములు కార్పొ'రేటు'కేనా..!

- అప్పుడు కృష్ణపట్నం..ఇప్పుడు రామాయపట్నం
- చౌకగా లాక్కుంటున్నారు..కోట్లకు అమ్ముకుంటున్నారు
- ప్రభుత్వం ద్వారా వ్యవహారం
- పంటపొలాల్లో రైతుల కన్నీళ్లు



రామాయపట్నం పోర్టు కోసం రైతుల నుంచి తీసుకున్న భూములు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"భారీ పరి శ్రమలు ఏర్పాటు చేస్తాం... నిరు ద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తాం...మీ ప్రాంతం కళకళలా డుతుంది.. అందరూ మీరు,. మీ పిల్లలు సంతోషంగా ఉంటారు " ఇది ప్రభుత్వం చెప్పే పాతపాట..పేద , మధ్య తరగతి రైతుల నుంచి కారుచౌకగా భూములు లాక్కొంటున్నారు.. కార్పొరేట్ సంస్థలకు కట్ట బెడుతున్నారు.. పరిశ్రమలు కనిపించడం లేదు. ఉద్యోగం, ఉపాధి ఊసే అసలే లేదు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇటీవల వరకు సుమారు 70 వేల ఎకరాలు భూ సేకరణ చేశారు. పెద్ద పెద్ద కార్పొరేష్ సంస్థలకు అప్పగించారు. సద్వినియోగం చేసుకుంది కేవలం 15 వేల ఎకరాలే.. మిగిలిన భూమి బీడుగా రైతుల ముందు కని పిస్తోంది. ఇప్పుడు రామా యాపట్నం పేరుతో ప్రభుత్వం మరో కొత్త భూ వ్య హారానికి తెరతీసింది. 9 వేల ఎకరాలు భూ సేకరణ చేయనుంది. పరి హారం అందివ్వ డంలోనూ నిర్లక్ష్యం కనిపి స్తోంది. ఇటీవల ఓ రైతు ఆత్మ హత్య చేసు కు న్నారు. ఇలాగే కొన సాగితేవచ్చని సిం హపురి బీడుగా మారుతుంది.

ప్రభుత్వం పేద, మధ్య తరగతి రైతుల భూములకు ఎసరు పెడుతోంది. 30 సంవత్సరాల క్రితం ఇఫ్కో ఎరువుల ఫ్యాక్టరీ కోసం రైతుల నుంచి 2700 ఎకరాలు తీసుకున్నారు. అప్పట్లో కేవలం ఎకరానికి రూ.40 వేలు చెల్లించారు. వివిధ కారణాలతో ఇక్కడ ఆ పరిశ్రమ రాలేదు. కిసాన్‌సెజ్ పేరుతో 2007 మార్చు చేసి, ఇప్పుడు పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2004 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక ఆర్థిక మండళ్ల పేరుతో జిల్లాలో పెద్ద ఎత్తున భూము స్వీకరించారు. రైతులకు ఇవ్వడానికి ముందుకు రాకపోయినా పరిశ్రమలు వస్తాయి. మీ బిడ్డలకు ఉద్యోగం ఉపాధి దొరుకుతుందని మాటలు చెప్పారు. కృష్ణపట్నం రైతుల నుంచి రిలయన్స్ థర్మల్ ప్రాజెక్టు కోసం 2500 ఎకరాలు తీసుకున్నారు. అప్పట్లో ఎకరా రూ.7 లక్షలకు తీసుకున్నారు. ఇప్పటికీ పరిశ్రమ స్థాపించలేదు. ఇప్పుడు ఎకరా రూ.50 నుంచి రూ.70 లక్షలు అయింది. అంబానీ రైతులకు అతితక్కువగా చెల్లించి ఇప్పుడు కోట్ల రూపాయాలకు అమ్ముకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కోసం మరో 6 వేల ఎకరాలు స్వీకరించారు. కొత్త పరిశ్రమలు రాకపోగ, ఉన్నవి వెళ్లిపోయాయి. మళ్లీ వస్తాయో లేదో తెలీదు.కృష్ణపట్నం ప్రాంతంలో ముత్తుకూరు, వెంకటాచలం, చిల్లకూరు ప్రాంతాల్లో 33 వేల మెగావాల్ట్ విద్యుత్ ఉత్పత్తికోసం 33 వేల ఎకరాలు భూమి కారుచౌకగా తీసుకున్నారు. కొందరు పరిశ్రమలు పెట్టలేదు. పెట్టినవి మూతపడ్డాయి. ఆ భూములను కొందరు బ్యాంకుల్లో పెట్టారు. మరికొందరు కోట్ల రూపాయాలకు అమ్ముకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. చిల్లకూరు మండలం, చింతవరం టెక్స్‌టైల్ పార్కు కోసం 2500 ఎకరాలు, నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్ 5600 ఎకరాలు, తడ మండలం, మాంబట్టు 2400 ఎకరాలు, శ్రీసిటి 5700 ఎకరాలు, వాకాడు మండలం దుగరాజుపట్నం పోర్టుకు భారీగానే భూములు స్వీకరించారు. ఇలా రైతుల నుంచి ప్రభుత్వం పెద్ద ఎత్తున భూములు స్వీకరించింది. అతి తక్కువ పరిహారం ఇచ్చి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టింది. ఆ భూములను కోట్లకు అమ్ముకోడానికి సిద్ధపడుతున్నారు. దీనిని రియల్ ఎస్టేట్ వ్యాపారం అంటారా ? నిరుద్యోగులకు ఉపాధి అంటారా ? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. ఏడాదికి రెండు పంటలు పండే పొలాలు, రైతుల కళ్ల ముందు బీడు పొలాలుగా కనిపించడంతో వారి చేత కన్నీరు పెట్టిస్తోంది. పరిశ్రమలు పెట్టకపోతే మా భూములు మాకివ్వండి అనే డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకే వత్తాసు పలుకుతోంది.

అప్పుడు కృష్ణపట్నం..ఇప్పుడు రామాయపట్నం..!

రామాయపట్నం పోర్టు ఎప్పటి నుంచో ప్రస్తావన ఉన్నప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత దీనికి శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో పోర్టుకు భూములు స్వీకరిస్తున్నారు. పోర్టు పక్కా పరిశ్రమలు ఏర్పాటు కోసం ప్రభుత్వం వేగంగా భూసేకరణ చేస్తుంది. అందుకోసం 9వేల ఎకరాలు భూసేకరణ చేయడానికి అధికారులు కసరత్తుచేస్తున్నారు. గుడ్లూరు మండలంలోని అనేక మంది రైతుల నుంచి భూములు తీసుకుంటున్నారు. స్థానికంగా రేటు ఎలా ఉన్నా తాము ఇచ్చేదే ధరగా ఉంది. చేవూరు ప్రాంతంలో ఎకరా రూ.23 లక్షల చొప్పున స్వీకరిస్తున్నారు. ఇక్కడ సోలార్ పరిశ్రమలతోపాటు, ఇతర పరిశ్రమలు వస్తాయని చెబుతోంది. 2006లో థర్మల్ విద్యుత్ ప్లాంట్ పేర్లుతో 33 వేల ఎకరాలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ భూములు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. రేపు రామాయపట్నం పరిస్థితి ఇంతేనా అనే అనుమానం కలుగుతోంది. రైతులకు పరిహారం ఇచ్చే విషయంలోనూ ఇబ్బందులుంటున్నాయి. ఇటీవల రైతు విశోర్ సెల్ఫీ తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు రైతులకు అదే పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి రైతుల నుంచి కారుచౌకగా భూములు తీసుకొని పెద్దలకు కట్టబెట్టే విధానకు స్వస్తి చెప్పాలని రైతులు కోరుతున్నారు. అభివృద్ధి జరగాల్సిందే. ఆ పేరుతో కార్పొరేట్ శక్తులు భూములు కట్టబెట్టడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పోర్టు నిర్మాణం పనులు సాగుతోన్న దృశ్యం

'రాళ్లపాడు' వద్ద రోడ్డెక్కిన రైతులు

కాలువకు నీరు విడుదల చేయాలని ధర్నా - స్తంభించిన వాహన రాకపోకలు



రాళ్లపాడు నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి - లింగసముద్రం : వరినారు పోసుకున్నారు. నాట్లు వేసేందుకు భూములను సిద్ధం చేసుకున్నారు. నీటిని కాలువకు విడుదల చేయాలని అధికారులు రైతులు కోరారు. కుడి కాలువకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు గేటును తెరిచే ప్రయత్నంలో గేటు విరిగి లోపల పడిపోయింది. మరమ్మత్తులు చేసి నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఎదురుచూస్తూ ఉన్నారు. సుమారు పది రోజులు కావస్తున్న మరమ్మత్తులు చేసి అధికారులు కాలవకు నీటిని విడుదల చేయకపోవడంతో విసుగు చెందిన ఆయకట్టు రైతులు రోడ్డుఎక్కారు. ఆదివారం రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ ఎదురుగా ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులు ధర్నా చేశారు. మధ్యాహ్నం కాలవకు ఎదురుగా రోడ్డుమీద కూర్చొని సుమారు మూడు గంటల పైన ధర్నా చేయడంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే రాళ్లపాడు నీటిని కాలవకు విడుదల చేయాలని, రైతులను ఆదుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం వీడాలని నినాదాలు చేస్తూ ధర్నాని కొనసాగించారు.గంటల కొద్ది ధర్నా చేయడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వలేటివారిపాలెం, గుడ్లూరు, కందుకూరు రూరల్ ముగ్గురు ఎస్ఐలు తన సిబ్బందితో ధర్నా చేస్తున్న చోటుకు వచ్చి రైతులతో చర్చలు జరిపారు. రైతులు వినకపోవడంతో ట్రాఫిక్ భారీగా నిలిచి పోయింది.గేటును తెరిచేందుకు క్రేన్ రావడంతో రైతులు కొంతమేరకు శాంతించి ధర్నాను ఆపివేశారు. దీంతో నిలిచి పోయిన వాహనాలు ఆర్‌టిసి బస్సులు వెళ్లాయి. ప్రాజెక్టు వద్ద రైతులు ధర్నా చేస్తున్నారని తెలుసుకున్న మిగిలిన రైతులు భారీగా ప్రాజెక్టు వద్దకు చేరుకొని ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు.కాలువకు నీటిని విడుదల చేయకపోతే మరోసారి ధర్నా చేసేందుకు సిద్ధమవుతామని రైతులు హెచ్చరించారు.

గేటు తెరిచేందుకు మరోసారి అధికారులు విఫలం

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తెరిచేందుకు అధికారులు మరోమారు విఫలం చెందారు. ఈనెల 7న గేటును తెరిచే సమయంలో తూము గేటు విరిగి లోపల పడిపోయింది. అప్పటినుండి అధికారులు గేటును తెరిచేందుకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ సుమారు పది రోజులు కావస్తున్న గేటు సమస్య కొలిక్కి రాలేదు. కుడి కాలువ పరిధిలో రైతులు పొలాలను సిద్ధం చేసుకుని వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ సమస్య ఉత్పన్నమైంది. ఒకవైపు వరి నారు పెరిగిపోవడం మరోవైపు పొలాలు ఎండి పోవడం జరుగుతోంది. రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు 20 అడుగుల నీటిమట్టంతో నిండు కుండను తలపిస్తున్నప్పటికీ నీటిని విడుదల చేసే అవకాశం లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదివారం గేటును తెరిచేం దుకు సిబ్బంది హైడ్రాలిక్ జాకీలతో ప్రయత్నిం చారు. ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో మరో ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నారు. గేటును క్రేన్‌తో పైకి లేపాలని భావించి కందుకూరు నుంచి క్రేన్ తెప్పించి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ గేటులో ఎలాంటి కదలికలు లేకపోవడంతో రైతులు నిరాశ చెందారు. పది రోజుల నుంచి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఉన్నత స్థాయిలో అధికారులు స్పందిం చకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గేటు సమస్యను పరిష్కరించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



క్రేన్ తో గేటును తెరిచేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం

స్వర్ణోత్సవ సంబరాలలో నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : ఉపాధాయుల సమస్యల కోసం నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు చేయడమే కాకుండా ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థను కాపాడుకొనేందుకు చేసే పోరాటాల్లో యుటిఎఫ్ ముందు వరుసలో నిలుస్తోందని ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) గడిచిన 50 ఏళ్ల కాలంలో చేపట్టిన పలు ఉద్యమాలు, పోరాటాల ద్వారా ఉపాధ్యాయ వర్గానికి, విద్యా రంగానికి అనేక సౌకర్యాలు, సౌలభ్యాలు సాధించిన నేపథ్యంలో రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించ తలపెట్టింది. ఈ నేపథ్యంలో నగరంలో ఆది,సోమవారం రెండు రోజు పాటు యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించేందుకు సిద్ధపడింది. మొదటి రోజు నగరంలోని విఆర్‌సి క్రీడా మైదానం నుంచి దర్గామిట్ట ప్రాంతంలోని శ్రీ కస్తూర్బా కళాక్షేత్రం వరకు జిల్లాలోని అన్ని మండలల నుంచి యుటిఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొని భారీ ప్రదర్శన చేపట్టారు. షేక్ సాబ్జీ సభా ప్రాంగణంలో నిర్వహించిన మహాసభ కార్యక్రమానికి యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.వి.శేషులు అధ్యక్షత వహించారు. తొలుత యుటిఎఫ్ మహిళా ఉపాధ్యాయులు 'కదలి రా..రా.. ఉపాధ్యాయ మిత్రమా.. యుటిఎఫ్ స్వర్ణోత్సవ పండగకు కదలిపోదాము' అని అంటూ కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మొదటి వర్థంతిని పురస్కరించుకోని ఘన నివాళి అర్పించారు. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం. ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, యూటిఎఫ్ సీనియర్ నాయకులు డి.మస్తాన్‌రావు, యూటిఎప్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె.పరధామయ్య, యుటిఎప్ పూర్వపు కార్యదర్శి శ్రీహరి తదితరులు దివంగత యుటిఎఫ్ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి సీనియర్ నాయకులు తమ జీవితాలను త్యాగం చేసి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేపట్టారన్నారు.మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపట్ల సరైన అవగాహన కలిగి పోరాటాలు చేయడం ద్వారా బలమైన యూనియన్‌గా గుర్తింపు పొందిందన్నారు. స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకోని జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించగా , ఆ పోటీలల్లో ప్రతిభను కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు.యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు,యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె.పరంధామయ్య,శ్రీహరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.సి అచ్చయ్య, సీనియర్ నాయకులు డి.మస్తాన్‌రావు, జిల్లా కోశాధికారి ఏ.మురళీధర్‌రావు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సాగునీటి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారు..

వైసిపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :రాష్ట్రంలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార టిడిపి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 5150 సాగునీటి సంఘాలు, 49 వేల టిసిలున్నాయన్నారు. టిడిపి అక్రమాలను గుర్తించే తమ పార్టీ ఎన్నికల్లో పాల్గొనవద్దని నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున టిడిపి నేతలు అక్రమాలు చేశారని, రైతుల ఓట్లు చేర్చకుండా, ఇష్టాను సారం వ్యవహరించారన్నారు. అధికారులు అధికారపార్టీకి మద్దతుగా నిలిచారన్నారు. ఎన్నికల సిబ్బందికి కనీసం శిక్షణ ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. కుడితిపాళెం గ్రామంలోని 12 టిసిలో సీక్రెట్ ఓటింగ్ నిర్వహించారని, ఇక్కడ రైతు విజయం సాధిస్తే టిడిపి నేతలు అడ్డుపడి చేతులు ఎత్తించారన్నారు. తమ ఖాతాల్లో వసుకున్నారని విమర్శించారు. సర్వేపలి నియోజకవర్గంలోని కసుమూరులో ఓట్లు వేయడానికి వచ్చిన వారని అడ్డకొని సిఐ బెదిరింపులు చేశారన్నారు. కందలపాడు గ్రామంలో ఓట్లు వేయడానికి దగ్గరకు రానివ్వలేదన్నారు. బోగోలు మండల కన్వీనర్ కోర్టుకు వెళ్లారని, కోర్టు ఇచ్చిన డైరెక్షన్‌ను పక్కన పెట్టి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో పోలీసు స్టేషన్‌లో వేశారు. టిడిపి నేతలు నీరు చెట్టు క్రింద దోచుకున్నాట్లు దారుణాలు చేశారన్నారు. కనీస నిబంధరలు పాటించకుండా పోలీసులను ఉపయోగించి దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న 'కాకాణి'

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం చేసిన ప్రాణత్యాగాన్ని వాసవి క్లబ్స్ నాయకులు కొనియాడారు. దాతలు సహకారంతో పేదలకు దుప్పట్లు , అల్పాహారం పంపిణీ చేశారు. గుర్రం అల్లూరయ్య మాట్లాడారు.

'అమరజీవి' త్యాగాలు మరువలేనివి..!

నెల్లూరు : రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను ఫణంగా పెట్టి ఆత్మార్పణం చేసుకున్న పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని ఉంటాయని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆత్మార్పణ దినోత్సవాన్ని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ ఉదయభాస్కరరావు, జిల్లా అధికారులు శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తొలుత సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి చేపట్టిన నిరాహార దీక్ష, స్వాతంత్ర్య సంగ్రామంలో పొట్టి శ్రీరాములు పాత్ర మొదలైన అంశాల వీడియోను జాయింట్ కలెక్టర్, అధికారులు ఆసక్తిగా తిలకించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి ఆలపించిన దేశభక్తి గీతానికి స్పందన లభించింది. డిఆర్‌ఒ ఉదయభాస్కరరావు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి ఉన్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి : మేయర్

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేసి అమరజీవిగా నిలిచిన పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి నగర పాలక సంస్థ గౌరవ మేయర్ శ్రీమతి స్రవంతి తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరిం చుకుని "ఆత్మార్పణ దినము" కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు.

ఎపిఎన్‌జిఒస్ అసోసియేషన్ భవన్‌లో..

ఎపిఎన్‌జిఒస్ అసోసియేషన్ భవన్‌లో అమరజీవి పొట్టి శ్రీ రాములు త్యాగాలను స్మరించుకున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ బండారుపల్లి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకష్ణ,అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయవర్మ ఉన్నారు.

కందుకూరు : పట్టణంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.. రాష్ట్ర సాధనకు శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలనుకొనియాడారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య నాయ కులు తాతా లక్ష్మీనారాయణ, మురారి శెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య, మురారిశెట్టి సుబ్బా రావు, కొత్త వెంకటేశ్వర్లు కోట వెంకట నరసింహం కాకుమాని ప్రవీణ్, చీదేళ్ల పిచ్చయ్య, కొత్తూరి శ్రీనివాసులు ఉన్నారు.



కందుకూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు



నెల్లూరులో..



గుడ్లూరులో..

వైసిపి కార్యాలయంలో.. కంద కూరు నియోజకవర్గం వైసిపి కార్యాల యంలో రాష్ట్ర అవతరణ కోసం పోరాడిన అమర జీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అమర జీవి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వైసిపి నాయకులు రావులకొల్లు బ్రహ్మానందం, గణేశం.గంగిరెడ్డి, పాశం కొండయ్య, రేణమాల.అయ్యన్న, వల్లూరి.కోటేశ్వరరావు, షేక్. రహీం, కెవెంకట్రామిరెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, ద్రోణాదుల చైతన్య, షేక్.రిజ్వాన్, జంగిలి. ఇశ్రాయేలుఉన్నారు.

గుడ్లూరు : పొట్టి శ్రీరాములు త్యాగం మరు వలేనివని ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మూలలు వేసి ఆదివారం నివాళు లర్పించారు సర్పంచ్ పాలకుర్తి శంకర్ అధికారులు పాల్గొన్నారు గుడ్లూరు బస్టాండ్ సెంటర్ లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎన్నమూరి ప్రమీలసుధాకర్ రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసినివాళి అర్పించారు.

తోటపల్లిగూడూరు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆద ర్శంగా ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మ గౌరవ వేదికను ఏర్పాటు చేయడం జరిగిం దని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు భీ మా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆ ధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరా ములు 72వ వర్ధంతి కార్యక్రమం జ రిగింది. జిల్లా అధ్యక్షులు కోసూరు నారాయణ గౌడ్ అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా భీమా రెడ్డి హాజరై మాట్లాడారు.

హామీలను విస్మరించిన సిఎం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : ఎన్నికల ప్రచార సభల్లో చేసిన హామీలను విస్మరించి అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ ట్రూ ఆఫ్ ఛార్జీలపేరుతో కోట్ల రూపాయులను ప్రజలపై మోపడం సరికాదని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం 53,54 డివిజన్ ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల సిపిఎం శాఖల ఆధ్వర్యంలో ట్రూ ఆఫ్ చార్జీలు వసూళ్ల చేయడాన్ని, స్మార్టు మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ జనార్థన్‌రెడ్డి కాలనీ, మసీదు సెంటర్ నుంచి నిరసన ప్రదర్శన కార్యక్రమం చేప ట్టారు.అనంతరం ఆయా ప్రాంతాల్లోని విద్యుత్తు సబ్‌స్టేషన్ల ఎదుట విద్యుత్తు బిల్లులను దగ్ధం చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యురాలు కత్తి పద్మ మాట్లాడుతూ సర్ చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారాలు మోపే ప్రయత్నం ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు షేక్ జాఫర్ ఆలీ, మూలం ప్రసాద్‌లు మాట్లాడుతూ ట్రూ ఆప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవం

నెల్లూరు : పెన్షన్ కోసం నిరంతరం పోరాటం చేసి సాధించిన దివంగత డిఎస్ నకరను స్మరించుకుంటూ ఈనెల 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్‌పివిఎన్ మూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. భకతవత్సలనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల సంక్షేమ భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ డి.గంగాద్రి, సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరవుతారన్నారు.

సింహపురి ఇంటర్నేషనల్ స్కూల్‌కు

బంగారు పతకాలు..!

జాతీయ స్థాయి కర్రసాములో మెరిసన విద్యార్థులు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో మండలంలోని పేడూరు ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో జరిగిన కర్రసాము పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. నెల్లూరులోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో కర్రసాము ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అస్సోసియేషన్ జాతీయ స్థాయి కర్రసాము పోటీలు నిర్వహించింది. కర్రలు పట్టుకుని విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో సింహపురి ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం (పే డూరు) స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కర్రసాము పోటీల్లో అత్యంత అద్భుతంగా రాణించిన వి. నిత్య, వి. వెంకట మనస్విని, ఎస్.కె. షిమిన్ జోయ, డి. వైష్ణవి, ఎ. రోహిత, ఎ. అక్షయ, ఎం. ధార్మిక్ రెడ్డి, ఎ. అజయ్ కుమా ర్, వి. జయేంద్ర ఉజ్వల్, ఎస్.డి షాహిద్ రసూల్ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. బి. ఇంద్రజ గౌడ్, జి. లక్ష్మిప్రియ, కె. మహిన్మావిత, కె. గౌత మి, ఎస్.కె మొహమ్మద్ మడియన్, కె. జయదీప్, టీ. మోక్షిత్, వి. హర్ష వర్ధన్‌లు వెండి పతకాలు సాధించారు. జె. నేహా మాన్విత, సి. పెంచల జేశ్విక్ రెడ్డి, ఎస్. ఆల్బిన్ సురేష్, కె. హర్ష వర్ధన్‌లు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాలకు సంబం దించిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సింహ పురి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు విద్యలోనే కా కుండా క్రీడల్లోనూ చిచ్చర పిడుగులుగా మారి సత్తా చాటుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో సైతం తమ ప్రతిభను చాటుతున్నారు. ప్రతి టోర్నమెంట్‌లో పతకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పేడూరుకు జాతీయ స్థాయి గుర్తింపు

సింహపురి ఇంటర్నేషనల్ స్కూల్ చిన్నారులు కర్రసాము పోటీలలో జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించడంతో పేడూరు గ్రామానికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చినట్లైయింది. జాతీయ స్థాయి పోటీలలో బంగారు, వెండి, కాంస్య పథకాలను సాధించిన ఈ కర్రసాము వీరులను స్కూల్ ఛైర్మన్ శివకుమార్, ప్రధానో పాధ్యాయు లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

100 కంపెనీలతో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


నెల్లూరు జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోం, ఉపాధి కల్పించడమే లక్ష్యమని, అందుకే జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తెలిపారు. ఆదివారం వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్లో సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను వేమిరెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వారి వారి విద్యార్హతలు తగ్గ ఉద్యోగం రావాలని కోరుకుం టున్నానన్నారు. మూడు నెలలకు ముందు నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. ఈ సారి 100 కు పైగా ఐటి, నాన్ ఐటి కంపెనీలు ఎంప్లాయ్ మెంట్ ఇస్తున్న నేపథ్యంలో మరింత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. ఉద్యోగావకాశాలు రాని యువతీ యువకులు నిరుత్సాహ పడొద్దని హితవు పలికారు. జాబ్ మేళా నిరంతర ప్రక్రియ అని, ప్రతి మూడు నెలలకు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేసే సామాజిక సేవలో భాగంగా నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిచాలని లక్ష్యంగా పెట్టుకు న్నామ న్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నది కళ్లలో ఆనందం చూడాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశయమన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశం రాని వారెవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. టాటా కన్సెల్టెన్సీ వారు తమ స్కిల్ సెంటర్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, వారి సూచనలు పాటించి మరో మూడు నెలల తరువాత నిర్వహించే జాబ్ మేళాలో అవకాశాలు దక్కించుకోవచ్చన్నారు. అనంతరం ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించి జాబ్ మేళాకు వచ్చిన యువతతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తనయులు అర్జున్ రెడ్డి, నీలిమా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మణ నాయుడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, తెలుగుదేశం నాయకులు బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో వేమిరెడ్డి దంపతులు

ఘనంగా దత్తాత్రేయ జయంతి

ప్రజాశక్తి - లింగసముద్రం : దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. మొగిలిచర్ల లో వెలసిన దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా ఆదివారం స్వామివారి సమాధిని పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని అలంకరిం చారు.పెద్ద సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ దత్తాత్రేయ స్వామి దేవాలయం వద్దకు వచ్చిన భక్తులందరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సా యంత్రం స్వామివారిని అలం కరించి ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రికి స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు గ్రామస్తులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేశారు.





దత్తాత్రేయస్వామి ఊరేగింపు దృశ్యం

విద్యుత్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు,సంగం, బుచ్చి, కొడవలూరు, నార్త్ రాజుపాలెం, ఇందుకూరు పేట మండలాలకు మెరుగైన విద్యుత్ సేవలందించడం కోసం నూతనంగా కోవూరు డివిజన్ను ఏర్పాటు చేశామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు తోపాటు జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సుధాకర్ రావులు అన్నారు.మండలంలోని పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణమండపంలో ఆదివారం యూనియన్ మహాసభ ,నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ డివిజన్లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూ ఇ ఇ యు) మొదటి మహాసభ జరగడం అభినందనీయమన్నారు. విద్యుత్ సంస్థను ప్రయివేటు పరం కాకుండా యుఇఇయు అలుపెరగని పోరాటం చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఎనర్జీ అసిస్టెంట్లు, కాంట్రాక్టు కార్మికులు, మీటర్ రీడర్స్, పీస్ వర్కర్స్ సమస్యల కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె జాకీర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, ఖాళీ పోస్టుల భర్తీ చేయాలని, గ్రేడ్ -2 జేఎల్ఎం లను ఏఎల్ఎం లుగా ప్రమోషన్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలను టైం స్కేల్ వర్తింప జేయాలన్నారు. మహాసభకు సిఐటియు కోవూరు, కొడవలూరు కార్యదర్శులు నెల్లూరు టౌన్ రూరల్, ఆత్మకూరు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు కాంట్రాక్టు కార్మిక నాయకులు పలువురు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. డివిజన్ అధ్యక్షులుగా.ఎన్ సురేంద్ర, ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు దయాకర్, కోశాధికారిగా వాసుదేవ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పట్టపు రామయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షేక్ షాహుల్తోపాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శులు, కాంట్రాక్టు కార్మిక నాయకులు, నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


సభకు విచ్చేసిన యుఇఇయు నాయకులు

రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉంటా

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండల కేంద్రంలో పువ్వాడి రాధాకృష్ణ కోల్డ్ స్టోరేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో కలిసి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ముందుగా శ్రీ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజక వర్గంలో మొట్టమొదటి పెద్ద కోల్డ్ స్టోరేజ్ ఇదేనని, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేసిన పువ్వాడి రాధాకృష్ణ కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు 2047 విజన్ తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే విధంగా ఆలోచించడం జరిగిందని, మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి దినాన వర్షాలు సమృద్ధిగా పడి నియోజకవర్గంలోని ప్రతి చెరువులో సంపూర్ణంగా నీరు ఉందని, రైతులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కోల్డ్ స్టోరేజ్ రైతన్నలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి చిన్న తరహా పరిశ్రమలకు నా సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ చండ్ర మధుసూదన్ రావు, జెడ్పిటిసి రావెళ్ళ నాగేంద్ర, మండల తెలుగు యువత మువ్వా లక్ష్మీనారాయణ, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల కూలీలను పెంచుతాం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్: వచ్చే ఏడాది జనవరి నుండి భవన నిర్మాణ కార్మికులకు కూలీలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి సిఐటియు నేత అల్లాడి గోపాల్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణం (రెడ్డి రమణారెడ్డి భవనం) సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆత్మకూరు ప్రాంత భవన నిర్మాణ కార్మికుల సమావేశ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి సిఐటియు నేత అల్లాడి.గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా తమ కూలీలను కూడా పెంచాలని ఈ సందర్భంగా జిల్లా సిఐటియు భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు కార్మికుల నిర్ణయం తీసుకున్నారు ఆదే విషయాన్ని కార్మికులందరికీ వీరు తెలియపరిచారు. ఈ సమావేశంలో బేల్దారుకు రూ.650 నుండి రూ.700 మరియు కూలీలకు ఇప్పుడు కూలీల కు రూ.550 నుండి రూ. 600 రూపాయలను పెంచుట్లు నిర్ణయించారు. పెంచిన కూలి రేట్లకు భవన నిర్మాణ యజమానులు ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జీవి శివప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైములు అనగా భవన నిర్మాణ కార్మికులకు వివాహ సమయంలో లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని భార్యలకు మొదటి ,రెండు కాన్పులకు రూ 20 వేల రూపాయలు సహకారం అందించే వారిని పిల్లల చదువుకున్న వారికి స్కాలర్షిప్ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం మరియు సిఐటియు అధ్యక్షులు కార్యదర్శులు నాగయ్య, సిఐటియు జిల్లా నాయకులు జీవీ.శివప్రసాద్, ఆత్మకూరు పట్టణ సిపిఎం పార్టీ కార్యదర్శి కొప్పోలు.డేవిడ్ రాజు, భవన నిర్మాణ కార్మిక మండల కార్యదర్శి సయ్యద్.సత్తార్, వైస్ చైర్మన్ లు గోవిందమ్మ, షేక్. ఖాజామొహిదీన్ భవన నిర్మాణ కార్మికులు తదితరులు హాజరయ్యారు


మాట్లాడుతున్న అల్లాడి గోపాల్

విగ్రహ శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని కరేడు పంచాయతీ అలగా పాలెం, కొత్త రెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కందుకూరి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛారణల తో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తను నిత్యం పూజించే ఆరాధ్య దైవం ఆంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపనకు పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి

చెట్టు నరికేయడం అన్యాయం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: ముందస్తు సమాచారం లేకుండా తనకు జీవనోపాధికి ఆసరాగా ఉన్న టెంకాయ చెట్టును కూలదోయడం సరికాదని మండలంలోని రావూరు గ్రామానికి చెందిన ముంగర శ్రీకాంత్ ఆవేదన చెందారు. మైపాడు నెల్లూరు రోడ్డు అభివృద్ధి పనులలో భాగంగా తనకు జీవనోపాధిగా ఉన్న 60 టెంకాయ చెట్లను తనకు ఏమాత్రమూ ముందస్తు సమాచారం లేకుండా నేలమట్టం చేయడం సరికాదన్నారు. నెలకు ఆంతో ఇంతో ఆర్థిక సహాయం అందిస్తున్న చెట్లను నరకడంతో తాను జీవనోపాధి కోల్పోయామని ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తనకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


చెట్టు నరికిన దృశ్యం

విద్యార్థుల కోసం కేంద్రం సరికొత్త పథకం 'పిఎం శ్రీ'

-ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాల కల్పన

ఎస్ఎస్ పిఓ సిహెచ్ ఉషాలక్ష్మి

ప్రజాశక్తి-నెల్లూరు
విద్యార్థిని విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం తాము ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు 'పిఎం శ్రీ' పేరుతో సరికొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో దేశ వ్యాప్తంగా దాదాపుగా 14 వేల స్కూళ్లను ఎంపిక చేసి ఆధునిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను నేరుగా అందజేస్తుంది. అటువంటి పథకం ద్వారా పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించుకొనేందుకు జిల్లాలో42 పాఠశాలలు అవకాశం దక్కింది.ఈ పథకం ద్వారా పాఠశాలల్లో ఎటువంటి పనులు నిర్వహిస్తున్నారో ఎస్ఎస్ పిఓ సిహెచ్ ఉషాలక్ష్మి మాటల్లో...

ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత పాఠశాలలుగా మార్చడానికి అవసరమైన నిధులు అందజేసేందుకు ప్రకటించిన 'పిఎం శ్రీ' అను సరికొత్త పథకం జిల్లాలో ఎన్ని పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ఏయే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలి..?

జవాబు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'పిఎం శ్రీ' పథకం ద్వారా లబ్ధిపొందేందుకు జిల్లాలోని 42 పాఠశాలలు ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలోని పాఠశాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న పాఠశాలల ఎంపిక మూడంచెల ప్రక్రియలో ఉంటుంది.



నిర్దేశించిన ఫార్మాట్లో సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన పాఠశాలకు జియో ట్యాగింగ్ చేసి కార్యకలాపాలను సమీక్షిలు నిర్వహిస్తారు. ఏడాదిలో నాలుగు సార్లు మాత్రమే ఈ పోర్టల్ ఓపెన్ అవుతుంది. ఆ సమయంలో మాత్రమే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక,మాధ్యమిక, ఉన్నత పాఠశాలు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోనే పాఠశాలలు పక్కా భవనం, బాలబాలికలకు వేరు వేరు టాయిలెట్లు, నీరు, విద్యుత్తు సౌకర్యం వంటివి ఖచ్చితంగా ఉండాలి.జిల్లాలో ఎంపికైన 14 పాఠశాలల్లో కెమెస్ట్రీ ల్యాబ్స్ ఏర్పాటు,37 పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన మేరకు క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులను ఆయా మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారి-2 పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందింపచేసేందుకు ప్రభుత్వం 'లిప్' కార్యక్రమం ప్రారంభించింది. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లాలో 20 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

ప్రశ్న. నాడు -నేడు సెకండ్ పేజ్ కింద ఎన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.. ఎస్టిమేషన్లు ఎంత వేశారు. ప్రభుత్వం అడ్వాన్స్గా ఎంత నిధులు విడుదల చేసింది..?

జవాబు.. నాడు - నేడు సెకండ్ పేజ్ కింద జిల్లా వ్యాప్తంగా 1112 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. వేసవి సెలవులు పూర్తి అయ్యేలోగా ఈ పనులు పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరాలనికి పాఠశాలలను అందంగా తీర్చి దిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ సెకండ్ పెజ్లో 726 ప్రైమరీ పాఠశాలల్లో, 173 అపర్ ప్రమరీ పాఠశాలల్లో, 164 పాఠశాలల్లో 1244 అధనపు తరగతి గదులు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఈ పనులు పూర్తి చేసేందుకు రూ.326 కోట్లు 3 లక్షలు ఖర్చు చేసేందుకు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. అడ్వాన్స్గా 52 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.8 కోట్ల 63 లక్షల 79 వేలు నిధులు విడుదల చేసింది.

ప్రశ్న. నాడు -నేడు సెకండ్ పేజ్ కింద ఎన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.. ఎస్టిమేషన్లు ఎంత వేశారు. ప్రభుత్వం అడ్వాన్స్గా ఎంత నిధులు విడుదల చేసింది..?

జవాబు.. నాడు - నేడు సెకండ్ పేజ్ కింద జిల్లా వ్యాప్తంగా 1356 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం.ఈ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.460 కోట్లు నిధులు కేటాయింపులు చేసింది. ఈ నిధులతో పాఠశాలల్లో అధనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ గోడలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నాడు నేడు సెకండ్ ఫేజ్ పనులు పాఠశాలలతోపాటు జిల్లాలోని 22 కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంది.నాడు నేడు సెకండ్ ఫెజ్ -ఎ కింద అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు, ఫర్నిచర్ ఏర్పాటుకు, అధనపు తరగతి గదుల నిర్మాణానికి , ఫౌండేషన్ పాఠశాలల నిర్మాణానికి రూ.13 లక్షల మేరకు నిధులు కేటాయించింది. జిల్లాలో నాడు నేడు సెకండ్ ఫేజ్1 పనులు 75 శాతం పూర్తి అయ్యాయి. మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న. ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్వహణకు నాడు -నేడు పథకంలో మొదటి విడతలో ఎన్ని పాఠశాలల్లో పనులు నిర్వహించారు. ఎంత మేరకు నిధులు ఖర్చు చేశారు..?

జవాబు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు- నేడు పనులు మొదటి విడత పనులు విజయవంతంగా పూర్తి చేశాం. జిల్లాలో 861 పాఠశాలలను ఎంపిక చేసి పనులు పూర్తి చేసేందుకు రూ. 260 కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించింది.ఈ నిధులతో పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం, అధనపు తరగతి

ఇంటర్వ్యూ

గదుల నిర్మాణం వంటివాటితోపాటు ఆర్ఓ సిస్టం, విద్యుత్తు సౌకర్యం, పెయింటింగ్, గ్రీనరీ బోర్డులు ఏర్పాటు చేశాం. మొదటి ఫేజ్లో పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో నూటికినూరు శాతం పనులు పూర్తి చేశాం


సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


ప్రజాశక్తి-ఉదయగిరి: వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 1వ 2వ 3వ తేదీల్లో జిల్లాలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కటారి అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాలు తర్వాత నెల్లూరు జిల్లాలో సిపిఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నా యన్నారు. ఈ మహాసభలు జిల్లాలో జరగడం సిపిఎం సభ్యులు గర్వంగా భావిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రతి మండలం, గ్రామం నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు మహాసభ విజయవంతానికి పనిచేస్తున్నారన్నారు. ఈ మహాసభలు జిల్లా అభివృద్ధికి ఉపయోగించుకొనుటకు సిపిఎం భావిస్తుం దన్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ లోని సీతారాంపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, జలదంకి, కొండాపురం తదితర మండలాలు అభివృద్ధికి నోచుకోక అనేక ఇబ్బందులతో వెనుకబడి ఉన్నాయన్నారు. సత్వరమే వెలగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి తాగు, సాగునీరు అందించాలన్నది సిపిఎం ప్రధాన కర్తవ్యం అన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి వేసిన శిలాఫలకాలు ప్రాజెక్ట్ పురోగతిలేక వెక్కిరిస్తూ దర్శనమిస్తున్నాయన్నారు. బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించి పనులను వేగవంతం చేస్తే మెట్ట ప్రాంతంలో ఐదు మండలాలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా సీతారాంసాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ ను వలసల నివారణకు పరిశ్రమలు మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర మహాసభలుగా డిమాండ్ చేస్తూ ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. జిల్లాలో కిసాన్ సేజ్ లో 2600 ఎకరాలు భూమి పీవీ నరసింహారావు హయాంలో కొడవలూరు మండలంలో ప్రజలకు ఇచ్చామని ఇప్పటికి ఒక ఫ్యాక్టరీ రాలేదన్నారు. ఈ డిమాండ్లతో సిపిఎంగా జిల్లా వ్యాప్తంగా ప్రజల ముందుకు ఆందోళనలతో ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఆదరించి 3న జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, ఎంపిటిసి కాకు విజయ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీనియర్ నాయకులు ఫర్దిన్ బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.అజయ్కుమార్

నీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి హవా

ప్రజాశక్తి-ఎఎస్పేట: మండలంలోని 14 నీటి సంఘాల ఎలక్షన్ శనివారం నిర్వహించడం జరిగింది. ఎలక్షన్ మొత్తం అధికార పక్షం ఒక్కొక్క నామినేషన్ తో ఏకగ్రీవం అయ్యేవిధంగా ముందస్తుగా వారి పార్టీకి సంబంధించిన విధేయుల చేత నామినేషన్ వేయించారు. మండలంలోని తెల్లపాడు సాగునీటి సంఘానికి అధ్యక్షులుగా లెక్కల విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా లెక్కల రమణారెడ్డి, గుంపర్లపాడు నీటి సంఘా నికి అధ్యక్షులుగా దలువాయి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మూలే జగన్మోహన్ రెడ్డి నీ, సిబివరం నీటి సంఘానికి అధ్యక్షులుగా దామెర హజరత్తయ్య, ఉపాధ్యక్షులుగా మాదాల మస్తానయ్య ను, చిన్నభీపురం నీటి సంఘానికి అధ్యక్షులుగా మబ్బు వెంగయ్య, ఉపాధ్యక్షులుగా ఉప్పలపాటి మాల్యాద్రి, అదేవిధంగా జమ్మవరం నీటి సంఘానికి మానికొండ రమణయ్య, ఉపాధ్యక్షులుగా పట్టం శ్రీనివాసులు, శ్రీ కొలను నీటి సంఘానికి నంది ప్రభావతమ్మ అధ్యక్షులుగాను, ఉపాధ్యక్షులుగా నూకరాజు మాలకొండ రెడ్డిని ఎన్నుకొన్నారు.





కుప్పురుపాడు నీటి సంఘం అధ్యక్షులుగా చౌటూరు సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా మల్లీనేని వెంకట శేషయ్య, పొనుగోడు నీటి సంఘానికి అధ్యక్షులుగా మల్లినేని వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా గన్నవరపు శ్రీహరి, రాజవోలు నీటి సంఘానికి అధ్యక్షులుగా గొల్లప్రోలు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కోటకొండ రమణమ్మ, పందిపాడు నీటి సంఘానికి అల్ల%శీ%పాటి సుబ్బారెడ్డి గారు, ఉపాధ్యక్షులుగా మురుకూటి రవీంద్ర రెడ్డి, గుడిపాడు పంచాయతీ నీటి సంఘానికి అధ్యక్షులుగా దేవరాల హజరత్తయ్య గారు, ఉపాధ్యక్షులుగా మతకాల రవి, చిరమణ నీటి సంఘానికి కొప్పోలు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పోలేపల్లి గోపాల్ రెడ్డి, పెద్దబ్బీపురం నీటి సంఘానికి అధ్యక్షులుగాపల్లా రామయ్య, ఉపాధ్యక్షులుగా అల్లంపాటి పెద్ద వెంగల్ రెడ్డి, అనుముసముద్రం నీటి సంఘానికి అధ్యక్షులుగా నలిశెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పామూరు వెంకటేశ్వర్లు ఏకాగ్రంగా ఎన్నికైనట్లు నీటి సంఘాల ఇఇ ఆర్ వెంకటేశ్వరావు, నోడల్ అధికారి పత్రిక ముఖంగా తెలియజేశారు. జమ్మవరం గ్రామంలో టిడిపిలోని ఇంకొక వర్గం వారు నామినేషన్ వేయడానికి వచ్చి ఆ నామినేషన్ తహశీల్దార్ సంతకం లేక తిరస్కరణ కు గురవడంతో వారు కొంచెం సేపు పోలింగ్ స్టేషన్లో వద్ద నిరసన వ్యక్తం చేశారు.

పేద పిల్లలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి: ఉదయగిరి నివాసులు వృత్తి రీత్యా కావలి పట్టణంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు రమేష్ - దుర్గా భవాని దంపతులు ఆదివారం వారి రెండో కుమారుడు జయక్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా కావలి పట్టణం తుపాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థకార్యాలయంలో ఆసంస్థ ద్వారా చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్నదానం చేయడంజరిగింది. ఈకార్యక్రమంలో దాతలు ఉపాధ్యాయులు రమేష్ - దుర్గా భవాని దంపతులు , వారి కుమారులు చంద్, జయక్రిష్ణ మరియు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.


ఆత్మకూరులో


ఉదయగిరిలో

ఘనంగా పొట్టిశ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి-ఉదయగిరి: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల- ఆదివారం పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని అసోసియేట్ డీన్ డాక్టర్ జి. కృష్ణారెడ్డి అధ్యక్షత ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఈ కార్యక్రమంను జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జి రమేష్, డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. .కార్యక్రమంలో డాక్టర్లు గోపికృష్ణ, రఘునాథ రెడ్డి, కిషన్ తేజ, బోధ నేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి :శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినంగా ప్రకటన చేయడం సంతోషించ తగ్గ విషయమని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి చిన్ని వర ప్రసాద్ రావు అన్నారు.ఆదివారం స్థానిక వెంగళరావు నగర్ లోని వంటేరు వరదా రెడ్డి పార్క్ లో ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహానికి,శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి వారు పూలమాలలు వేసి,ఘనంగా నివాళు లర్పించారు.కార్యక్రమంలో బీసీ ఐక్యత భవన్ ట్రెజర్ మధు, కార్యవర్గ సభ్యులు బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన ఆత్మ త్యాగం, బలిదానం ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం, ప్రత్యేక గుర్తింపు రావటం జరిగిందని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన "ఆత్మార్పణ దినం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ం.కార్యక్రమంలో మండల అధ్యక్షులు తటవర్తి రమేష్, తటవర్తివాసు, గుత్తికొండ కిషోర్ బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, పోట్లూరి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు:స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణ త్యాగం చేసిన కీర్తిశేషులు పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు డి. కోటేశ్వరరావు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి అయినా మహా పురుషుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకటరమణమ్మ , పేర్కొన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకొని మున్సిపల్ కార్యాల యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పులిమి శైలజారెడ్డి, గౌస్ బాషా , సూరా భాస్కర్ రెడ్డి, గందళ్ళ వేణు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ మాధవి, శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న ఎంఎల్ఎ

వికలాంగులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కావలి: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఆటల పోటీల విజేతలకు ఆదివారం కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. సుమారు 300మంది వికలాంగులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. వికలాంగుల నాయకుడు మండవ వెంకటరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మండలానికి 200 ఇళ్ల స్థలాలు హెడ్ క్వార్టర్ లో ఇవ్వమని అడిగారు. దానికి మీ బంధువుల దగ్గరే ఉండండి! నేను తప్పక అర్హులకు మంజూరు చేస్తాను అన్నారు. వికలాంగుల కాలనీలో సకలాంగులు అక్రమంగా ఆక్రమించి ఉన్నారన్నారు. కాలనీలన్నీ వైసిపి హయాంలో ఆక్రమణలకు గురైన, వాటిని తప్పక చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఐరిష్ పడని,ఫింగర్ ప్రింట్స్ పడనీ, వికలాంగులకు స్పెషల్ గా పెన్షన్ వచ్చినట్లు ముఖ్యమంత్రి తోటి మాట్లాడతానన్నారు. వికలాంగుల కాలనీలో రోడ్లు సౌకర్యం కల్పించాలన్నారు. స్లమ్ ఏరియాలో మొత్తము సిమెంట్ రోడ్ల తోటి ప్రయారిటీ ప్రకారం చేస్తానని చెప్పారు.కరెంటు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు.దీంతో వికలాంగులందరూ కరతాళ ధ్వనులతో ఆనం దించారు. కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు వికలాంగుల నాయకులు మహబూబ్ బాషా, కాట్ మల్లం మాలకొండయ్య, గాలం మాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంఘం సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు డెస్క్: ఆటో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ముత్తుకూరు మండలం, ముత్తుకూరు స్టాండ్, పిడతా పోలూరు పెట్రోల్ బంక్ స్టాండ్, పంటపాలెం స్టాండ్లలో విస్తృతస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలగట్ల సురేష్ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఉన్నతమైన చదువులు చదువుకుని ఉద్యోగ ఉపాధి లేక ప్రభుత్వాలపై ఆధారపడకుండా ఆటో కార్మికులుగా జీవనం కొనసాగిస్తున్నారు,ఈ సందర్భంలో పోలీసు ఆర్టిఏ ఫైనాన్స్ వేధింపులు అధికమవుతున్నాయన్నారు. ఈ రంగంపై ఆధారపడి జీవించేటటువంటి ఆటో, ట్రాన్స్పోర్టు రంగ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు గడ్డం అంకయ్య, ముత్తుకూరు ఆటోస్టాండ్ అధ్యక్షులు విజయ్, వావిళ్ల వెంకయ్య, బెల్లంకొండ సురేష్, పోలయ్య, సీతారామయ్య, ఏడుకొండలు, సుధాకర్, వావిళ్ల వెంకటేశ్వర్లు, ఏడుకొండలు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవ కార్యక్రమాలకు అవార్డు

ప్రజాశక్తి-బిట్రగుంట: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడలో ప్రతిభ అవార్డు కు బిట్రగుంట అక్షయ ఉమెన్స్ అసోసియేషన్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకురాలు గోవాల బాల శైలజా కు సేవ భూషణ్ అవార్డును కాకినాడ జిల్లా జడ్జి సిహెచ్ రఘుపతి వసంత కుమార్, ఆనరబుల్ ప్రెసిడెంట్ బాబిరెడ్డి, ఎస్పి విష్ణు రఘువీర్ అవార్డును అందుకున్నారు. ఆంధ్ర ,తెలంగాణ రాష్ట్రాలలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల చేసినవారికి కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా బాల శైలజ విలేకరులతో మాట్లాడుతూ సామాజిక సేవారంగంలో 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న డాక్టర్ బొడ్డ పాటీ దాసు హ్యూమన్ రైస్ ఫౌండేషన్ వారు కాకినాడలో నిర్వహించే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రతిభ పురస్కార్ అవార్డులను అక్షయ ఉమెన్స్ అసోసియేషన్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థను చేసిన సేవలను గుర్తించిందని తెలిపారు. ప్రతిభ అవార్డు ఇవ్వడంతో ఇంకా బాధ్యతను ఎక్కువగా పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ బోడి పాటీ దాసు, జనరల్ సెక్రటరీ స్వామి నాయుడు, గుడ్లూరి సత్యనారాయణ, స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణం కచ్చేరిమిట్టలోని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబ డుతున్న బ్లెస్డ్ హోమ్ పిల్లలకు క్రిస్మస్ సందర్భంగా దుబాయ్ లో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త కండే వెంకటేశ్వర్లు సహకారంతో వారి సతీమణి కండే లావణ్య,మామ వెంకటేశ్వర్లు,కుమారుడు పునీత్ కండె నూతన వస్త్రాలను వితరణ చేయడం జరిగింది. ఈసందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు ఎంవిఎన్ ప్రసాదరావు మాట్లాడుతూ మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహణలో ఉన్న బ్లెస్డ్ హోమ్ పిల్లలు చక్కగా చదువుకొని వృద్ధి లోనికి రావాలని, తల్లిదండ్రు లను గురువులను గౌరవించడమే కాదు పూజించాలని హితవు పలికారు.కార్యక్రమంలో వై దాసు, డేనియల్ బాబ్జి, అంకపనాయుడు, రావులకొల్లు శివ, శ్రీనివాసులు, శివకృష్ణ, పల్లవి పాల్గొన్నారు.



బిల్లులను దగ్ధం చేస్తున్న నాయకులు

పెంచిన కరెంటు బిల్లులు దగ్ధం

ప్రజాశక్తి-కావలి: సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన కరెంటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్నిఉపసంహ రించుకోవాలని ఆదివారం సిపిఎం ఆధ్వర్యం లోఉదయగిరి బ్రిడ్జి కూడలిలో కరెంట్ బిల్లులను దగ్ధం చేయడం జరిగింది.ఈసందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో తాము అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లులు పెంచం అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రూప్ సర్దుబాటు చార్జీల పేరుతో 18 వేల కోట్ల రూపాయలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు.అంతేకాకుండా స్మార్ట్ మీటర్ల ను బిగించి, ప్రజలపై మరింత భారాన్ని మోపేందుకు సిద్ధపడుతుం దన్నారు.గత ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచినప్పుడు వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలను మోపి ఆదానికి లాభాలు చేకూరుస్తు న్నాడ న్నారు.ఇది సరైన విధానం కాదన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్య క్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి.తిరుపాలు, పట్టణ కమిటీ సభ్యులు యర్రంశెట్టి కృష్ణమోహన్, జి.మధుసూదన్ రావు, బి.కృష్ణయ్యతో పాటు డివైఎఫ్ఐ నాయకులు పి శ్రీను కె. చెన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 1029 / 2022

M/s. Canara Bank, Magunta Layout Branch, Nellore City, Represented by its **Senior Manager** - Plaintiff
Vs
Green Dairy, rep. by its Proprietor, Sri. Andam Ramalinga Satish Gupta, - Defendant

Notice to Defendant

Green Dairy, rep. by its Proprietor, Sri. Andam Ramalinga Satish Gupta, S/o **Sudhakar,** resident of Plot No.102, 2nd Floor, NTR Nagar, Near Theerdha School, Manumasiddi Nagar, Nellore City, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే09-01-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామా ధమరేశ్వర్, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The District Consumer Disputes Redressal Commission : Nellore.
C.C.No. 95 / 2024

Thanamala Srinath - Complainant
Vs
1. **Ayan Autotech,** Rep. by its Proprietor, B.V.Nagar, Nellore.
2. **Okinawa Autotech Pvt. Ltd.,** Rep.by its Manager, Gurgaon (122018), Haryana - Opposite Parties

Notice

To,
Opp-1. Ayan Autotech,
Rep. by its Proprietor, D.No.26-9-104, Beside VMD Motors (Vespa Showroom) B.V.Nagar, Mini Bypass Road, Nellore, SPSR Nellore District-524004.

పై నెంబరున కంప్లయినెంట్ పై తెలిపిన నెల్లూరు జిల్లా వినియోగ దారుల ఫోరంలో మీపై కంప్లయింట్ దాఖలు చేసియున్నారు. సదరు కంప్లయింట్లో మీకు నోటీసు నిమిత్తం **తే24-12-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన నెల్లూరు జిల్లా వినియోగ దారుల ఫోరంలో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎండి. రహీమ్ఖాన్, ఎం.బి.ఎ., బి.ఎల్.,
కంప్లయినెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.